చకచకా పాతబస్తీ మెట్రో పనులు!

- కోట్ల అలీజా నుంచి మొఘల్‌పురా వరకు కూల్చివేతలు
- ఇప్పటికే మార్కింగ్ చేసి, చెక్కులు అందజేసిన మెట్రో అధికారులు
- ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు పనులు

చార్మినార్: మెట్రో రైలు కోసం ఎదురుచూస్తున్న పాతబస్తీ వాసుల కల నెరవేరే రోజు దగ్గరలోనే ఉంది. సీఎం ఆదేశాలతో పాతబస్తీలో మెట్రో రైలు కోసం రోడ్డు విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మొన్నటివరకు మొఘల్‌పురా బీబీబజార్ చౌరస్తాలో కూల్చివేతలు చేపట్టగా..తాజాగా బుధవారం నుంచి కోట్ల అలీజా (చెడవ్ కీ మసీద్) చౌరస్తాలోని ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి కార్యాలయంతో పాటు హోటల్ లాడ్జింగ్‌ను కూల్చివేస్తున్నారు.


మెట్రో రైలు కోసం కోట్ల అలీజా చౌరస్తాలో కూల్చివేస్తున్న భవనం

మెట్రో కోసం జేఏసీ ప్రతినిధుల కృషి..

గతంలో పాతబస్తీలో మెట్రో పనులు చేపట్టకపోవడంపై పెద్దఎత్తున నిరసనలు వెల్లు వెత్తాయి. దీంతో మజ్లిసేతర పార్టీలన్నీ ఏకమై 2017 నవంబర్ 21న నాయకులందరూ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటయ్యారు. మెట్రో రైలు సాధనకు గతంలో పలు నిరసనలతో పాటు ఆందోళనలు చేపట్టారు. అలాగే మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసి పాతబస్తీకి మెట్రో అవసరాన్ని, ప్రాధాన్యతను వివరించారు. సమావేశాలు, నిరసన దీక్షలు, నిరసన ర్యాలీలు కొనసాగించారు.

చకచకా కూల్చివేతలు..

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు మజ్లిస్ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ కూడా పాతబస్తీలో మెట్రో రైలు పనులను వెంటనే చేపట్టాలని సీఎంను కోరడంతో రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాతబస్తీలో మెట్రో పనులు ప్రారంభిస్తామని కాంగ్రెస్ అధిష్టానం హామీనిచ్చింది. అనుకున్నట్లుగానే పాతబస్తీ మెట్రో రైలు ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉండి వెంటనే పనులను ప్రారంభించాలని మెట్రో ఎండీకి చెప్పడం..పవర్ పాయింట్ ప్రజంటేషన్ జరగడం..నిధులు కేటాయించడం.. శంకుస్థాపన చేయడంతో కూల్చివేతలు చకచకా జరిగిపోతున్నాయి.

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు..

ఫలక్‌నుమా నుంచి ఎంజీబీఎస్ ద్వారా సికింద్రాబాద్ జేబీఎస్ వరకు ఉండే ఈ మెట్రో కారిడార్ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అయితే ఇప్పుడు ఫలక్‌నుమా వరకు కాకుండా చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్‌ను పొడిగించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎట్టకేలకు మీరాలంమండి, దారుషిఫా, ఎతేబార్ చౌక్, శాలిబండ, శంషీర్ గంజ్ ద్వారా ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు మెట్రో పనులు వేగంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుతం మొగల్ పురాలోని బీబీబజార్ చౌరస్తా నుంచి వ్యాపార సముదాయాలు తొలగిస్తున్నారు. ఇక్కడి చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. చాంద్రాయణ గుట్ట నుంచి ఆర్జీఐఏ వరకు మెట్రో కారిడార్ కొనసాగనున్నది.

రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలుసుకోవాలి


కార్యక్రమంలో జస్టిస్ శేష శయనారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రతిఒక్కరూ రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలుసుకోవాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేష శయనారెడ్డి అన్నారు. కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ జాతీయ సాహిత్య పరిషత్ సంయుక్తాధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాష నిలయంలో మాతృభూమి సాహిత్య రూపకం గురువారం జరిగింది. ఆయన ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ వంటి బిల్లులను చట్టాలుగా తీసుకువచ్చేందుకు రాజ్యాంగాన్ని మార్చుకునే అవకాశం ఉందన్నారు. కళాకారులు ప్రదర్శించిన మాతృభూమి సాహిత్య రూపకంలో దేశభక్తి కనబడిందని అభినందించారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ గోపీనాథ్‌రెడ్డి, హాస్య బ్రహ్మ శంకర్‌నారాయణ, ధర్మ ప్రచారకులు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆధ్యాత్మిక రచయిత్రి డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ పీఎస్ మూర్తితో పాటు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

'పోలీస్ గ్రౌండ్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించొద్దు'


ఆందోళన చేస్తున్న ఆల్ పార్టీల నాయకులు

అబిడ్స్: గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించవద్దని ఆ నియోజకవర్గ ఆల్ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గోషామహల్ నుంచి బాలయ్యబాడ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, ఆల పురుషోత్తం రావు, మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్, కేడీ.దినేశ్, వినోద్ యాదవ్, కోటి శైలేష్ కురుమ, వాసు ముదిరాజ్, దత్తుతో పాటు వందలాది మంది ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీస్ గ్రౌండ్స్ పరిసరాల్లో లక్షలాది మంది జీవిస్తున్నారని ఉస్మానియా ఆసుపత్రి నిర్మిస్తే వారంతా అనారోగ్యాల పాలవుతారన్నారు. వారికి గోషామహల్ ప్రాంతంలోని షైవుడ్, హార్డ్‌వేర్, ఇతర పలు అసోసియేషన్ల నాయకులు సైతం సంఘీభావం ప్రకటించారు. చంచల్‌గూడ జైలును నగర శివారు ప్రాంతాలకు తరలించి అదేప్రాంతంలో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని కోరారు. అయినా వినకుండా శుక్రవారం ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ పనులు చేపడితే అడ్డుకుంటామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మహనీయులను స్మరించుకోవాలి


మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సింగరేణి సీఎండీ ఎన్.బలరాం

నాంపల్లి: మహనీయులను నిరంతరం స్మరించుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎందరో స్వాతంత్ర్య సమర యోధులు విభిన్న పంథాలో పోరాటాలు కొనసాగించి దేశానికి స్వేచ్ఛను ప్రసాదించేందుకు కృషి చేశారన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం 2 నిమిషాల మౌనం పాటించి గాంధీజీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్ పిఅండ్‌పి) జి.వెంకటేశ్వరరెడ్డి, జీఎం (కోఆర్డినేషన్) ఎస్డిఎం సుభానీ, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, జీఎం లలిత్‌కుమార్, సింగరేణి అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి



గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ సూచించారు. టోలిచౌకీలోని మెరాజ్ కాలనీలో గల తన కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. మజ్లిస్ నాయకుడు సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు

దూద్ బౌలి: ఫుట్ పాత్ లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సర్కిల్–10 ఏసీపీ రాందాస్ హెచ్చరించారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీస్ లతో కలిసి గురువారం ఫుట్ పాత్ లపై అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. జీహెచ్ఎంసీ సిబ్బంది సత్యనారాయణ రవీందర్, మొగల్ పురా పోలీసులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ


రోడ్డు భద్రత మాసోత్సవాల్లో జాయింట్ కమిషనర్ రమేశ్

సుల్తాన్‌బజార్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ జాయింట్ కమిషనర్ సి.రమేశ్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, అలాగే ఫోర్ వీలర్ వాహనదారులు తప్పకుండా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ డాక్టర్ సూర్య ధనుంజయ్, ఆర్టీఓ అమర్నాథ్, ఆర్టీఓ ఇన్‌స్పెక్టర్లు గీతా చౌహాన్, అనిత, కార్తీక్, అభిలాష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

ముగిసిన సంగీత నృత్య కళాశాల వార్షికోత్సవం

సుల్తాన్‌బజార్: భారతీయ నృత్య కళలు, సాహిత్యాన్ని భావితరాలు నేర్చుకునేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ్ ముతాలిక్ అన్నారు. కళాశాల 72వ వార్షికోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా భారతీయ నృత్యం, కథక్, కర్ణాటక సంగీతం, హిందుస్థానీ గాత్రం, పేర్ని నృత్యం, తబల, సితార్ లాంటి సంగీత వాయిద్యాల్లో శిక్షణ పొందిన విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు హాజరై విద్యార్థులకు మృదంగం వాయిద్యాంపై కొన్ని సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో వరంగల్ సంగీత నృత్త కళాశాల మాజీ ప్రిన్సిపాల్ దుడ్డు సీతారమ్మతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హామీలు అమలయ్యే వరకు పోరాటం


పోలీస్‌స్టేషన్లో బీఆర్ఎస్ నాయకులు జీవన్‌సింగ్, శ్రీధర్ సాగర్ తదితరులు

జియాగూడ: అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలుచేసేదాకా పోరాటం చేస్తామని కార్వాన్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమ నాయకులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఠాకూర్ జీవన్ సింగ్, శ్రీధర్‌సాగర్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ వద్ద నివాళులర్పించి వినతి పత్రం ఇవ్వాల్సి ఉండగా గుడిమల్కాపూర్ పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా వారిని ఇంటి వద్ద అరెస్టు చేసి కుల్సుంపురా, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఎన్నోసార్లు అరెస్టు అయ్యామని, సీఎం రేవంత్ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చే దాక ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు సి.బాబు, దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పదవులు లేకున్నా ప్రజాసేవకే అంకితం

బండ్లగూడ: పదవులు ఉన్నా లేకున్నా ప్రజా సేవకు ఎల్లప్పుడూ అంకిత భావంతో కృషి చేస్తామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ బుర్ర భూపాల్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ భవానీ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించామన్నారు. గడచిన ఐదేళ్లలో కాలనీ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని తెలిపారు. కాలనీ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షులు శైలజజ్ఞానేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బుర్ర భూపాల్‌గౌడ్

జాతిపితకు ఘన నివాళి


బాపుఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బాపుఘాట్‌తో పాటు పలుచోట్ల గురువారం మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు, నాయకులు, విద్యార్థులు గాంధీజీ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని, కేఆర్.రాజ్‌కుమార్..


బాపుఘట్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం'


ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు గురువారం ఆయనను కలిశారు. శాలువాలతో సత్కరించి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు బీజేపీనే భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆనంద్‌గుప్తా, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి.యాదగిరి, ఏనుగుల సందీప్, దొడ్డి శ్రీనాథ్, శ్రీకాంత్‌సాగర్, వెంకటేశ్‌సాగర్, అరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

కుస్తీ పోటీల్లో ప్రతిభ


యువ రెజ్లర్ ముతాహేర్‌ను సన్మానిస్తున్న నజీబ్ తదితరులు

గోల్కొండ: హైదరాబాద్ కేసరి చాంపియన్‌షిప్‌లో గోల్కొండకు చెందిన యువ రెజ్లర్ హమద్ బిన్ ముతాహేర్ తృతీయ స్థానంలో నిలిచాడు. దీంతో టోలిచౌకీలోని ఐహెచ్ఆర్‌వో కార్యాలయంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ చైర్మన్ మహ్మద్ నజీబ్ యువ రెజ్లర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో యువకులకు ఆర్గనైజేషన్ తరఫున ట్రైనర్లతో శిక్షణ ఇప్పించామన్నారు. ఎంజీపీ డైరీ ప్రాజెక్ట్స్ చైర్మన్ మహ్మద్ గౌస్ మాట్లాడుతూ.. యువ రెజ్లర్లకు తమ కంపెనీ తరఫున ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని అలాగే విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ సమీర్, షేబాజ్, మహ్మద్ ఫహద్, మునావర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న శ్రీరామ్‌లల్లా నృత్య రూపకం



గన్‌ఫౌండ్రీ: అయోధ్యలో శ్రీరామ్‌లల్లా కొలువై ఏడాది పూర్తయిన సందర్భంగా 108 మంది కళాకారులు 108 నిమిషాల పాటు చేసిన ప్రదర్శనతో శ్రీరాముడి వైభవాన్ని కళ్ల ముందు ప్రదర్శించారు. గురువారం రవీంద్ర భారతిలో పంచమవేద నాట్య నిలయం ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకున్నది. నాట్య గురువు ఆర్. కనకదుర్గ రూపకల్పన చేసిన ఈ ప్రదర్శన భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైనట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కేవీ.రమణారావు ప్రకటించారు. అంతకుముందు నాట్య గురువు రమణసిద్ధి శిష్యులు ప్రదర్శించిన జగదానంద తారక నృత్య రూపకం అలరించింది. కార్యక్రమంలో సాహితీవేత్త సాధన నర్సింహాచార్యులు, కార్పొరేటర్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మాసబ్‌ట్యాంక్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో వర్క్‌షాప్

విజయనగర్ కాలనీ: మాసబ్‌ట్యాంక్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో ఆకట్టుకునేలా కథనాలను రూపొందించడంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో దృశ్య శ్రవ్య నిర్వహిస్తున్న క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్ పోటీల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకే ఈ ప్రోగ్రాంను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రచయిత, దర్శకురాలు సరస్వతి మాట్లాడుతూ.. ప్రేక్షకులకే కాకుండా ఆయా రంగాల ప్రముఖులను కూడా ఆకట్టుకునేలా విద్యార్థులు కథలను రూపొందించాలని సూచించారు. మీడియా, వినోదరంగాలకు చెందిన అంతర్జాతీయ సదస్సు వేవ్స్‌లో భాగంగా ఫిబ్రవరిలో నిర్వహించనున్న క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్ పోటీల్లో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

మునీందర్ సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న శివకుమార్ యాదవ్

జియాగూడ: జియాగూడ డివిజన్ కార్పొరేటర్‌గా, బీజేపీ నాయకుడిగా ఆదిరాల మునీందర్ ఎంతో సేవ చేశారని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ శివకుమార్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జగదీశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ యాదవ్, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు గుర్రం శివశంకర్, రమేశ్ చౌగ్లే, సందీప్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవతా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

మణికొండ: కేపీఆర్ కాలనీలో నాగదేవత, మైసమ్మ అమ్మవార్ల ఆలయాల్లో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గురువారం జరిగిన పూజల్లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవాలయాలు శక్తి కేంద్రాలని, అవి మానవులకు శక్తితో పాటు మానసిక ప్రశాంతతను ఇస్తాయన్నారు. ప్రతిష్ఠాపన పూజలు శనివారం వరకు కొనసాగుతాయని కొండకళ్ల వంశీయులు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

అపార్ నమోదును వేగవంతం చేయాలి

అత్తాపూర్: కేంద్ర ప్రభుత్వం సూచించిన మేరకు దేశంలోని ప్రైవేట్, గవర్నమెంట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల పూర్తి వివరాలు యుద్ధ ప్రతిపాదికన రికార్డుల్లో నమోదు చేయాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ తెలిపారు. అపార్ నమోదు ప్రక్రియలో భాగంగా అత్తాపూర్‌లోని గురునానక్ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... విద్యార్థులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అపార్ విద్యా విధానాలతో ఎంతో మేలు జరుగుతుందన్నారు.

సంగీతం.. పూర్వ జన్మ సుకృతం

సినీ సంగీత దర్శకుడు కోటి

మణికొండ: సంగీతం వాయించటం పూర్వజన్మ సుకృత ఫలం ఉంటేనే సిద్ధిస్తుందని సినీ సంగీత దర్శకుడు కోటి అన్నారు. పియానోయిస్ట్ టీఎస్ సతీష్‌కు యూకే హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ రావటంతో గండిపేటలోని ఆయన నివాసంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ... తనకు ఎన్నో గొప్ప సినిమాలకు మ్యూజిక్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చిందన్నారు.

తన ఇంట్లో తన తండ్రి పియానో వాయించే వారని, అతను వాయించిన పియానోకు వంద సంవత్సరాలు దాటిందన్నారు. టీఎస్ సతీష్ భవిష్యత్తులో మంచి పియానోయిస్ట్ అవుతారని, మరింత సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ ప్రవచన కర్త దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.

మెకానికల్ ఇంజినీరింగ్‌లో శేషప్పకు డాక్టరేట్

శంషాబాద్: శంషాబాద్‌లోని రైతు కుటుంబానికి చెందిన అంగడి శేషప్ప మెకానికల్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ పట్టాను పొందారు. నగరంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శేషప్ప జేఎన్‌టీయూ (హైదరాబాద్) ఆచార్యుడు డాక్టర్ బి.ఆంజనేయప్రసాద్ పర్యవేక్షణలో 'ఇన్వెస్టిగేషన్ ఆఫ్ మెకానికల్ క్యారెక్టరిస్టిక్ ఆఫ్ ఏఎల్ 7075 మెటల్ మ్యాట్రిక్స్ కంపోజిట్స్, ఏఎల్203, ఎస్ఐసీ నానోఫిల్లర్స్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు. దీంతో హైదరాబాద్ జేఎన్‌టీయూ నుంచి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.